క్లుప్తంగా

ఆధ్యాత్మిక సేవలతో మానసిక ప్రశాంతత


అమ్మవారిని దర్శించుకుంటున్న వైఎస్సార్ సీపీ

పాలకొల్లు అర్బన్: ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల ద్వారా యువత మధ్య స్నేహసంబంధాలు పెంపొందుతాయని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) అన్నారు. పాలకొల్లు పట్టణం, పోడూరు మండలంలోని పలు గ్రామాల్లో శనివారం దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆయా ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి ప్రతిమలను గుడాల గోపి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే యూత్ కమిటీని అభినందించారు. గుత్తులవారిపేట ఆంజనేయస్వామి ఆలయం వద్ద, చైతన్య హాస్పటల్ వద్ద, వీవర్స్ కాలనీని మినీ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలోనూ, పోడూరు మండలంలోని కొమ్ముచిక్కాల వద్ద, అలాగే శివాలయం వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారి ప్రతిమలను గుడాల గోపి దర్శించుకున్నారు. ఆయన వెంట జోగాడ ఉమామహేశ్వరరావు, పెచ్చెట్టి కృష్ణాజీ, తలుపూరి భుజంగరావు, జి.ప్రసాద్, ఆంజనేయులు, జోగి వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

మొగల్తూరు డిప్యూటీ తహసీల్దార్‌గా సంధ్య


డీటీ సంధ్యను అభినందిస్తున్న వీఆర్‌ఓలు

మొగల్తూరు: మొగల్తూరు మండల డిప్యూటీ తహసీల్దార్‌గా డీఎస్ సంధ్య శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వహించిన జి.నరేష్ కుమార్ పాలకొల్లుకు బదిలీకావడంతో ఆయన స్థానంలో ఆచంట డీటీగా విధులు నిర్వహిస్తున్న సంధ్యను మొగల్తూరుకు రెగ్యులర్ డీటీగా బదిలీ చేశారు. డీటీగా బాధ్యతలు చేపట్టిన సంధ్యను మండలంలోని వీఆర్‌ఓలు, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి అభినందిచారు.

బాణసంచా వ్యాపార లైసెన్స్‌ల కోసం దరఖాస్తు చేసుకోవాలి


ఆర్డీఓ దాసి రాజు

నరసాపురం: దీపావళి సందర్భంగా నరసాపురం డివిజన్‌లో బాణసంచా విక్రయాలకు సంబంధించి తాత్కాలిక లైసెన్స్‌లు జారీ చేస్తామని ఆర్డీఓ దాసి చెప్పారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బాణసంచా వ్యాపారం చేయాలనుకునే వారు ఈ నెల 26లోగా సబ్ కలెక్టర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుతో పాటుగా ఆధార్ కార్డు, పాన్‌కార్డు జిరాక్స్‌లు, చలానా జత చేయాలని పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమించి బాణసంచా విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

పెనుగొండ: యువత ఉన్నత ప్రతిభను అలవర్చుకొని ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ద్వారా అందించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా యువజన సర్వీసుల శాఖాధికారి ప్రభాకర్ అన్నారు. శనివారం పెనుగొండ ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు కళాశాలలో జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలోని నిర్వహించిన వ్యక్తిత్వ వికాసం భవిష్యత్ మార్గదర్శకత్వం అవగాహన సదస్సులో పాల్గొన్నారు. యూత్ సర్వీస్ జిల్లా ప్రథమ స్థానంలో ఉందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు మాట్లాడుతూ విద్యార్థులు అన్ని సబ్జెక్టుల్లో విషయానికి తెలుసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఏపీ పర్యాటక శాఖ మేనేజర్ ఎస్.పట్టాభి రామన్న, జాతీయ యోగాకోచ్ కె.రామకృష్ణ, జాతీయ కేరీర్ సర్వీసెస్ యంగ్ ప్రొఫెషనల్ జి.ప్రవీణ్‌కృష్ణ, ఆంధ్రా యూనివర్శిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.పల్లవి తదితరులు పాల్గొన్నారు.

సౌమ్య ఆసుపత్రి ప్రారంభం


సౌమ్య ఆసుపత్రి ప్రారంభోత్సవంలో పాల్గొన్న గుడాల శ్రీహరిగోపాలరావు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని వెంకట్రామా ఏసీ సెంటర్‌లో ఉన్న సౌమ్య ఆసుపత్రిని స్థానిక బ్రాడీపేట బైపాస్ రోడ్డులో ఆదిత్య కళాశాల ఎదురుగా ఏర్పాటు చేసిన నూతన భవనంలో మార్చారు. శనివారం ప్రారంభోత్సవంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరిగోపాలరావు పాల్గొని డాక్టర్ రాజశేఖర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ సిహెచ్ సత్యనారాయణమూర్తి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ డి మహేశ్వరరావు, యడ్ల తాతాజీ, కర్రి ప్రభాకరరెడ్డి, కర్రి వెంకట నారాయణరెడ్డి (వాసు) పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ప్రాకార మండపం


ఆలయ ప్రాకార మండపం శ్లాబ్


జనార్ధన స్వామి ఆలయం పక్కన ఒరిగిన 3 స్తంభాలు


శనీశ్వర స్వామి మండపం వద్ద లీకేజీతో నాచు పట్టిన స్తంభాలు

- క్షీరారామలింగేశ్వరుని ఆలయంలో శ్లాబ్ నాని స్తంభాలపై నుంచి వర్షపు నీరు
- పార్వతి అమ్మవారి గర్భాలయంలోకి చేరుతున్న నీరు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయం లోపల స్వామి వారి ప్రాకార మండపం శ్లాబ్ వర్షానికి నాని స్తంభాల నుంచి వర్షం నీరు లీకు అవుతుంది. స్వామివారికి తూర్పు ఆగ్నేయంగా కొలువై ఉన్న లక్ష్మీ, పార్వతి అమ్మవారి గర్భాలయంలో లీక్ అయ్యి గోడలు, గుమ్మం నుంచి వర్షం నీరు కారుతుంది. అంతేకాకుండా స్వామివారికి ఉత్తర భాగంలో కొలువై ఉన్న జనార్ధనస్వామి ఆలయం ప్రక్కన ఉన్న ప్రాకార మండపానికి చెందిన మూడు స్తంభాలు ఒరిగి ఉన్నాయి. వర్షం వచ్చినప్పుడు స్తంభాల నుంచి కారుతున్న వర్షం నీరు మండపం ప్రాకారంలోకి రావడంతో ఆలయం చుట్టూ తిరిగే భక్తులు జారిపడిపోతున్నారు. అలాగే అమ్మవారి గర్భాలయంలో అర్చకులు సైతం ఎప్పుడు జారిపోతుందోనని ఆందోళనకు గురవుతున్నారు.

వాలు లేకపోవడంతో అసలు సమస్య

ఆలయ ప్రాకార మండపం చుట్టూ వాలు వివిధ రకాలుగా ఉండడంతో ఒకచోట వర్షం నీరు కిందకి కారుతుంది. ఒక పక్క ఫ్లాట్‌గా ఉండడంతో పాటు పైన పూర్వం నిర్మించిన శ్లాబ్ పలక పెంకులు లేచిపోవడంతో నీరు నిల్వ ఉండి లీకేజీ అవుతుంది. ప్రాకారం మండపం తూర్పు , దక్షిణ, పడమర భాగాల్లో ఫ్లాట్‌గా ఉండడం వల్ల నీరు నిల్వ ఉండి శ్లాబ్‌లోకి దిగిపోతుంది. ఉత్తర భాగంలో గోడుగా ఉండడంతో నీరు కిందకు కారుతుంది. ఉత్తర భాగంలో ఉన్న మూడు రాతి స్తంభాలు ఒరిగిపోయి ఉన్నాయి.

మరమ్మతులు చేయాల్సిందే....

అయితే ఈ విషయంలో ఆలయ అధికారులు శ్లాబ్ ప్రమాదకరంగా లేదు గానీ మరమ్మతులు చేయాల్సిందేనని చెబుతున్నారు. చుట్టూ ఉన్న శ్లాబ్ పలక పెంకులు లేచిపోవడం వల్ల లీకేజీలు ఏర్పడుతున్నాయని స్పష్టం చేస్తున్నారు. పలకలు తొలగించి పైన సిమ్మెంట్ పనులు చేయిస్తే లీకేజీ సమస్య తగ్గుతుందని అనుకుంటున్నారు. దీనికి సంబంధించి పురావస్తు శాఖ అధికారుల సూచనల మేరకు మరమ్మతులు చేయాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు.


పార్వతి అమ్మవారి ఆలయంలో లీకేజీతో వస్తున్న వర్షం నీరు

ఉన్నతాధికారులు పరిశీలించారు

క్షీరారామలింగేశ్వరస్వామి ప్రాకార మండపం శ్లాబ్ లీకేజీ అవుతుంది. ఇటీవల పురావస్తు శాఖకు సంబంధించి ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించారు. ప్రాకార మండపం చుట్టూ శ్లాబ్ పైన 5 లేక 6 అంగుళాలు మేర తొలగించి సిమ్మెంట్ పని చేస్తే సరిపోతుంది. అది కూడా భారీ పని ముట్లతో కాకుండా శిల్పాలను చెక్కినట్లుగా ఆ ఆరు అంగుళాలు చేతి ఉలితో తొలగించాల్సి ఉంటుంది. ఒరిగిన స్తంభాలను జాకీలతో సరి చేస్తాం. వీటికి సంబంధించి అంచనాలు తయారు చేయాలని సంబంధిత అధికారులకు సూచించాం. త్వరలో పనులు చేపడతాం.

– తిమ్మరాజు, పురావస్తు శాఖ అధికారి, కాకినాడ

రఘురామకృష్ణరాజుపై కేసు నమోదు చేయాలి


వెలగలవారిపాలెంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాలమహానాడు నాయకులు

పెనుమంట్ర: ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామ కృష్ణరాజుపై ఇప్పటివరకు పోలీసులు కేసు నమోదు చేయకపోవడం దారుణమని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజు అన్నారు. శనివారం పెనుమంట్ర మండలం వెలగలవారిపాలెం పంచాయతీ పరిధిలో నిర్వహించిన మాలమహానాడు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్యేగా ఉంటూ అంబేడ్కర్ ఫ్లెక్సీ చించి వేయడం దారుణమని ఇప్పటివరకు ఆయన పై కేసు నమోదు చేయకపోగా క్షమాపణ కూడా చెప్పకపోవడం ఆయన అహంకారానికి నిదర్శమన్నారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు గడ్డం జాన్సన్, జిల్లా ప్రధాన కార్యదర్శి సీలే రాజ్‌కుమార్ ఆచంట నియోజకవర్గ కార్యదర్శి బాబూ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

నరసాపురం: పట్టణంలోని అరుంధతిపేటకు చెందన ఓ వ్యక్తిపై పోక్సో చటం ప్రకారం కేసు నమోదు చేసినట్టు టౌన్ ఎస్సై జయలక్ష్మి చెప్పారు. శనివారం తెల్లవారుజామున బాలిక తల్లి ఫోన్ మాట్లాడుకోవడానికి ఇంట్లో నుంచి బయటకు రాగా, అదే సమయంలో మద్యం సేవించి ఉన్న ప్రసాద్ అనే వ్యక్తి ఇంట్లోకి వెళ్లి పడుకుని ఉన్న బాలిక పక్కన పడుకోబోయాడు. విషయం గమనించిన తల్లి కేకలు వేయడంతో చుట్టుపక్కలవారు వచ్చి వ్యక్తిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు

పాలకొల్లు మండల ఈఓపీఆర్‌డీగా మూర్తిబాబు


మూర్తిబాబును అభినందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు మండల ఈఓపీఆర్‌డీగా తాళ్ల మూర్తిబాబు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ ఈఓపీఆర్‌డీగా పని చేసిన కేఎం వైభవతి పోడూరు బదిలీ అయ్యారు. ఆచంట మండల ఈఓపీఆర్‌డీగా పని చేస్తున్న మూర్తిబాబు సాధారణ బదిలీల్లో పాలకొల్లు మండలానికి వచ్చారు. మూర్తిబాబును పంచాయతీ కార్యదర్శులు లింగం సత్యనారాయణ, సానబోయిన శ్రీనివాస్, శివరామాంజనేయులు, సతీష్, పాలా శ్రీనివాస్, మల్లేశ్వరరావు తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

8, 9 తేదీల్లో ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు శిక్షణ

పాలకొల్లు అర్బన్: పంచాయతీ పరిపాలనపై ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు అవగాహన కల్పించేందుకు ఈ నెల 8, 9వ తేదీల్లో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ తరగతులు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ ఎస్ఎస్ ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మండలంలోని 22 గ్రామ పంచాయతీలకు చెందిన ఉపసర్పంచ్‌లకు, అలాగే ఇద్దరు వార్డు సభ్యులకు, వీరిలో ఒక మగ, మరో ఆడ వార్డు సభ్యులకు ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4.30గంటల వరకు ఈ శిక్షణ ఇస్తారని వివరించారు.

తహసీల్దార్‌ను కలిసిన డీలర్లు

మొగల్తూరు: మొగల్తూరు తహసీల్దార్ ఇటీవల భాధ్యతలు చేపట్టిన కె.రాజకిశోర్‌ను శనివారం మండల రేషన్ డీలర్లు కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. డీలర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అందే వెంకటేశ్వరరావు, సత్తినేని ఘజేంద్ర, దొంగ ఏడుకొండలు, కాసాని బాలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలపై శిక్షణ

నరసాపురం రూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా సిబ్బంది రైతులకు మెరుగైన సేవలందించాలని నరసాపురం ఆర్డీఓ దాసి రాజు పేర్కొన్నారు. నరసాపురం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన నరసాపురం, మొగల్తూరు మండలాల ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బందికి శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. రైతు పండించిన పంటను కనీస మద్దతు ధర కంటే తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన అవసరం లేదన్నారు. అలాగే రైతులు తమ ధాన్యాన్ని కావాల్సిన మిల్లర్లకు అమ్ముకోవచ్చునని ఆర్డీఓ దాసి రాజు వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ ఈదా అనిలకుమారి మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల సిబ్బంది, వీఏఏ, వీహెచ్ఏలు రైతులకు ఈ–పంట నమోదు చేసిన వారికి ఈకెవైసీ పూర్తి చేసి ధాన్యం విక్రయించుకునే విధంగా చేయాలని తెలియజేశారు. కార్యక్రమంలో నరసాపురం తహసీల్దార్ రాజరాజేశ్వరి, నరసాపురం, మొగల్తూరు మండలాల ఏఓలు జాన్సన్, అబ్దుల్ రహీం తదితరులు పాల్గొన్నారు.


నరసాపురంలో మాట్లాడుతున్న ఆర్డీఓ దాసిరాజు


ఆచంటలో ధాన్యం కొనుగోలుపై సమీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

యలమంచిలిలో..

యలమంచిలి: ఖరీఫ్ (సార్వా) పంట చేతికొచ్చే సమయానికి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయాలని నరసాపురం రెవెన్యూ డివిజనల్ అధికారి దాసి రాజు కోరారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఖరీఫ్ 2024–25 సీజనుకు సంబంధించి రెండవ విడత ట్రైనింగ్ ప్రోగ్రాం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ధాన్యం సేకరణకు అవసరమైన గోనె సంచులు, పురుకొస, తేమ యంత్రాలు ముందుగానే సిద్ధం చేసుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో తహసీల్దార్ గ్రంధి పవన్ కుమార్, నరసాపురం ప్రాంతీయ సహాయ వ్యవసాయ సంచాలకులు ఈద అనిలకుమారి, సీఎస్‌డీటీ ఐవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆచంట తహసీల్దారు ఎం సోమేశ్వరరావు అన్నారు. శనివారం సార్వా –2024 ధాన్యం కొనుగోలుపై మండలస్థాయి శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతు సేవా కేంద్రాలు , సహకార పరిపతి సంఘాలు ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు చేస్తారని వివరించారు. రైతు పండించిన పంట నచ్చిన మిల్లుకు తోలుకునే అవకాశం కల్పిస్తామని చెప్పారు. కె.చంద్రకాంత్, వి.సునీల్‌కుమార్, ఎంఎల్‌ఓ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న అమ్మవార్ల అలంకరణలు

నరసాపురం: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు మూడో రోజుకు చేరుకున్నాయి. పట్టణంలోని వివిధ ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన మండపాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండపాల వద్ద విద్యుత్ అలంకరణలు ఆకట్టుకుంటున్నాయి. పండ్ల మార్కెట్ వద్ద 40వ దేవీ శరన్నవరాత్రి వార్షికోత్సవాల్లో భాగంగా జరుగుతున్న ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. అమ్మవారు చంద్రఘంటాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఉత్సవ కమిటి సభ్యులు మండెల సత్యనారాయణ, గునిశెట్టి సత్యనారాయణ, ఏర్పాట్లు పర్యవేక్షించారు. రాయిపేట పుంతలోముసలమ్మ అలయంలో అమ్మవారికి అన్నపూర్ణ దేవిగా అలంకరించారు. గోల్డ్ మార్కెట్ వద్ద స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.

నరసాపురం మండలంలో..

నరసాపురం రూరల్: దేవీ నవరాత్రుల సందర్భంగా ఆలయాలు గత మూడు రోజులుగా కొత్త శోభను సంతరించుకున్నాయి. కొప్పర్రు శివాలయం వద్ద శనివారం అమ్మవారిని రాజరాజేశ్వరిగా అలంకరించారు. గొందిమూల సెంటర్‌లో ఏర్పాటు చేసిన పందిరి వద్ద, లిఖితపూడి, తూర్పుతాళ్లు, చిట్టవరం, సారవ తదితర గ్రామాల్లోని ఆలయాలతో పాటు పలు కూడళ్లలో అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. సారవ గ్రామంలోని ముత్యాలమ్మ అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజ కార్యక్రమాలు నిర్వహించారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: దేవి శరన్నవరాత్రుల వేడుకల్లో భాగంగా శనివారం అమ్మవారిని అన్నపూర్ణ దేవిగా అలంకరించి దర్శించుకున్నారు.రామన్నపాలెం పంచాయతీ ఆకనవారితోటలో ఏర్పాటు చేసిన అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించి భక్తులు పూజలు నిర్వహించారు. స్థానిక పార్వతీ దేవి ఆలయంలోను, భవానీ కాలనీలోని కనకదుర్గమ్మ ఆలయంలోను, కూరగాయల మార్కెట్‌లో నెలకోల్పిన అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలి వచ్చారు.ముత్యాలపల్లి,, శేరేపాలెం ,కొత్తపాలెం, కాళీపట్నం, పాతపాడు, జగన్నాదపురం,కెపిపాలెం గ్రామాల్లోని ఆలయాల్లోను, అమ్మవారి విగ్రహాల వద్ద మహిళలు పూజలు నిర్వహించారు.


నరసాపురం రూరల్: కొప్పర్రులో రాజరాజేశ్వరిగా పూజలు అందుకుంటున్న అమ్మవారు

పెనుమంట్రలో..

పెనుమంట్ర: పెనుమంట్ర గ్రామంలోని కనకదుర్గమ్మ ఆలయం వద్ద శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. వేద పండితులు చిట్టా రవిశర్మ, ఆలయ అర్చకులు సన్నిధి రాజు సారధి ఆధ్వర్యంలో ప్రతిరోజూ అమ్మవారికి అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహిస్తుండగా ఆలయ మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కమలంపూడి సాయినారాయణరెడ్డి ఆధ్వర్యంలో కనకదుర్గ ఉత్సవ కమిటీ దాతల సహకారంతో ప్రతిరోజూ ఆలయానికి వచ్చే భక్తులకు చక్కెర పొంగలి, పులిహోర ప్రసాదలను భక్తులకు పంపిణీ చేస్తున్నారు. గ్రామ కమిటీ గ్రామ ప్రముఖుడు గంట వాసు ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో అమ్మవారి ప్రతిమ నెలకొల్పి 48 మంది యువకులు భవాని మాలలు ధరించి నిత్య పూజలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తేతలి సుధీర్ రెడ్డి, నల్లమిల్లి రామిరెడ్డి పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు సందర్భంగా శనివారం అశ్వీయు శుద్ధ తదియ పురస్కరించుకొని శ్రీనగరేశ్వర మహిషాసురమర్ధనీ వాసవీ కన్యక పరమేశ్వరి ఆలయంలో అమ్మవార్లు లలితా దేవిగా దర్శనం ఇచ్చారు. ఉదయం నుంచి శ్రీనగరేశ్వర సామికి మహాన్యాశ ఏకాదశ రుద్రాభిషేకాలు, సూర్యనమస్కారాలు, మహాలింగార్చన నిర్వహించారు. అనంతరం అమ్మవార్లకు కుంకుమార్చనలు అభిషేకాలు నిర్వహించి మహిషాసురమర్ధనీ, వాసవీ కన్యకపరమేశ్వరి అమ్మవార్లను లలితా దేవిలుగా అలంకరించారు. అలాగేఅఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలో నివాసవీ శాంతి థాంలో మరకత శిల వాసవీ మాతను అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. ఆలయ అర్చకుడు శిష్టా మణికంఠ ప్రత్యేక పూజలు చేశారు. ఆచంట మండలంలోని పెదమల్లం మాచేనమ్మ అమ్మవారు అన్నపూర్ణాదేవిగా దర్శనం ఇచ్చారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: దేవిశరన్నవరాత్రుల ఉత్సవాలు సందర్భంగా స్థానిక శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణదేవిగా అలంకరించారు. స్థానిక చిన గోపురం వీధిలో బంగారు వారి శ్రీ ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో అమ్మవారిని వారాహి దేవిగా అలంకరించారు. స్థానిక యడ్లబజారు సెంటర్‌లోని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు పట్టణంలో పలు కూడళ్లలో ఏర్పాటుచేసిన మండపాల్లో అమ్మవార్లకు భక్తులు కుంకుమ పూజలు నిర్వహించారు.


పాలకొల్లు సెంట్రల్:రామలింగేశ్వరుని ఆలయంలో అన్నపూర్ణ దేవి


పెనుమంట్ర: పూజలు అందుకుంటున్న కనకదుర్గమ్మ


పెనుగొండ: లలితాదేవిగా మూలవిరాట్ వాసవీ మాత


మొగల్తూరు: అన్నపూర్ణాదేవిగా కూరగాయల మార్కెట్‌లోని దుర్గమ్మ


నరసాపురం: అన్నపూర్ణదేవి అలంకరణలో పుంతలో ముసలమ్మ

ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు


విలేకరులతో మాట్లాడుతున్న తహసీల్దారు సోమేశ్వరరావు

పెనుగొండ: ఆచంట మండలంలో గోదావరి తీర ప్రాంతం నుంచి ఇసుక తవ్వకాలకు ఎలాంటి అనుమతులు లేవని, అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆచంట తహసీల్దారు ఎం.సోమేశ్వరరావు హెచ్చరించారు. శనివారం ఆచంటలో విలేకరులతో మాట్లాడుతూ కోడేరు, కరుగోరుమిల్లి, అయోధ్యలంక గ్రామాల నుంచి ఇసుక అక్రమంగా తరలి పోకుండా ఆయా ర్యాంపుల వద్ద వీఆర్వో, వీఆర్ఏలతో నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇసుక అవసరమైన వారు లాన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, వారి అవసరాలు పరిశీలించిన తరువాత అనుమతులు ఉన్న ర్యాంపుల నుంచి ఇసుక తెచ్చుకోవడానికి అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు. అక్టోబరు నెలాఖరు నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఆచంటమండలంలో రేషన్ షాపుల బైపరికేషన్‌లో బాగంగా కొత్తగా రెండు రేషన్ షాపులు రానున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఖాళీగా ఉన్న మరో ఆరు షాపులకు నోటిఫికేషన్ త్వరలో జారీ చేసి భర్తీ చేస్తామన్నారు. ఆచంట మండలంలోని కందరవల్లి, పెనుమంచిలి, కొడమంచిలి, కరుగోరుమిల్లిల్లో ల్యాండ్ రీ–సర్వే పూర్తయిందన్నారు.

భవన కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి

పెనుగొండ: ఉచిత ఇసుక విధానాన్ని అమలుచేయడంతో పాటు, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరణ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఎస్ వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సీపీఎం ఆధ్వర్యంలో పెనుగొండ తహసీల్దారు జి.అనితకుమారికి వినతి పత్రం సమర్పించారు. ఇసుక కొరతతో భవన నిర్మాణ కార్మికులకు మూడు నెలలుగా పనులు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీని ప్రభుత్వం వెంటనే నిలబెట్టుకోవాలన్నారు. షేక్ పాదుషా, నీలాపు ఆదినారాయణ, రాజమహేంద్రవరం వెంకటేష్ పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

పాలకొల్లు సెంట్రల్: ప్రతి విద్యార్థీ ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాన్ని సాధించడానికి కష్టపడాలని ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ రిజిస్ట్రార్ జి.సుధాకర్ అన్నారు. శనివారం స్థానిక చాంబర్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కళాశాల చైర్మన్ కె.వెంకటనరసింహరావు, ప్రిన్సిపాల్ డి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.